# 13 నుంచి శ్రీపద్మావతి పరిణయం



ఆకాశరాజు వైశాఖ శుద్ధ దశమీ శుక్రవారం పూర్వఫల్గునీ నక్షత్రంలో నారాయణవనంలో కన్యాదానం చేసినట్లుగా వేంకటాచల మాహాత్యం తెలుపుతోంది.

తిరుమలలో 'నిత్యకల్యాణం పచ్చలతోరణం' అని ప్రసిద్ధి కెక్కి నిత్యమూ ఎన్నో సేవలు ఉత్సవాలు జరుగుతున్నా... ఇంతవరకు, వేంకటేశ్వరస్వామి పద్మావతిని వివాహమాడిన ఆనాటి ముహూర్తానికి గుర్తుగా ఎలాంటి ఉత్సవంగాని ఊరేగింపుగాని జరగడం లేదు. వేల ఏండ్ల తర్వాత, ఇటీవల తొలిసారిగా ఆనాటి పద్మావతీ శ్రీనివాసుల కల్యాణోత్సవ ముహూర్తానికి గుర్తుగా, సరిగా అదే ముహూర్తంలో ప్రతి వైశాఖ శుద్ధ దశమి నాటికి అటుముందు ఒక రోజు, ఇటు తర్వాత ఒక రోజు మొత్తం మూడు రోజుల పాటు "పద్మావతీపరిణయం" అన్న పేరుతో ఉత్సవం జరపటానికి తిరుమల తిరుపతి దేవస్థానం 92 వైశాఖ మాసం నుంచి ఘనంగా నిర్వహించడం జరుగుతున్నది కూడ.

ఇది సాధారణంగా మే నెలలో మూడు రోజుల పాటు జరుపబడుతున్నది. ఆనాటి నారాయణ వనానికి ప్రతీకగా తిరుమల నారాయణగిరి ఉద్యానవనంలో ఈ పద్మావతి పరియోత్సవ వేడుకలు జరగడం విశేషం. ఈ ఉత్సవాల కోసం తిరుమల నారాయణగిరి ఉద్యానవనం రంగు రంగుల పుష్పాల చిత్రాలతోను, విద్యుద్దీపాలతోను శోభాయ మానంగా తీర్చిదిద్దబడి అలంకరిస్తారు. ఆ వనంలో మధ్యలో వున్న పరిణయ వేదిక, దాని చుట్టూ నయనా నందకరంగా ఎత్తైన చిత్రాలు, లతలు, తీగలతో అలంకరిస్తారు.

మొదటి రోజు అంటే 13-05-2008 మంగళవారం శుద్ధ నవమి రోజున తిరుమలలో యథాప్రకారంగా తెల్లవారు జాము నుంచి సుప్రభాతం, తోమాలసేవ, కొలువు, మొదటి అర్చన, నైవేద్యం, మున్నగు దైనందిన కార్యక్రమాలు, ఆర్జిత కల్యాణోత్సవం, బ్రహ్మోత్సవం, డోలోత్సవం... తదితర నిత్య ఉత్సవాలు ముగిసిన తర్వాత శ్రీ స్వామివారు ప్రత్యేకంగా బంగారు శ్రీ పీఠాన్ని ఎక్కి దేవాలయం ఎదురుగా స్వర్ణరథశాల పక్కన వున్న వాహన మండపానికి వేంచేస్తారు.

> ఆనాటి నారాయణ వనానికి ప్రతీకగా తిరుమల నారాయణగిరి ఉద్యానవనంలో ఈ పద్మావతి పరియోత్సవ వేడుకలు జరగడం విశేషం. ఈ ఉత్సవాల కోసం తిరుమల నారాయణగిరి ఉద్యానవనం రంగు రంగుల పుష్పాల చిత్రాలతోను, విద్యుద్దీపాలతోను శోభాయమానంగా తీర్చిదిద్దబడి అలంకరించబడుతుంది.

## మొదటిరోజు గజవాహనం

అక్కడ గజవాహనంపైన వేంచేపుచేసి సర్వా భరణాలతో, పుష్పమాలలలో శ్రీస్వామివారిని అలంకరిస్తారు. అటు పిమ్మట ఆలయంలో, దంతపు పల్లకిలో శ్రీదేవి భూదేవులను వేంచేపుచేసి అలంకరిస్తారు. ఆ తర్వాత గజారూఢుడైన స్వామివారు ముందు వెళుతుండగా, పల్లకినెక్కిన వధువులు స్వామిని అనుసరించగా, మందీమార్బలంతో భక్తులతో



బాజాభజంత్రీలతో ఆలయానికి నైరుతి మూలలో గల తిరుమల నారాయణగిరి ఉద్యానవనంలోనికి తరలివస్తారు.

అప్పటికే చక్కగా అలంకరించిన నారాయణగిరి ఉద్యానవనంలో శోభాయ మానంగా తీర్చి దిద్దిన పెండ్లి మండపంలో నిత్యనూతన వధూవరులైన శ్రీస్వామివారికి అమ్మవారలకు ఎదుర్కోలు, పూలదండలు మార్చుకోవటం, పూలబంతులాట, నూతన వస్త్ర సమర్పణ జరుగుతాయి. ఆతర్వాత శ్రీస్వామివారికి కొలువు (ఆస్థానం) జరుగుతుంది. ఈ కొలువులో సర్వజగత్ప్రభువైన శ్రీ వేంకటేశ్వరస్వామి వారికి వేదాలు, పురాణాలు, సంగీతరాగాలు, కవితలు, నృత్యాలు... ఇలా విన్పింపబడతాయి. పిదప ఆర్జిత భక్తులకు వస్త్ర బహుమానం, ప్రసాద వితరణ జరుగుతుంది.

ఆ తర్వాత శ్రీదేవి భూదేవి సహితుడైన స్వామి బంగారు పల్లకి నెక్కి అశేష భక్తజనం మధ్య ఊరేగుతూ ఆలయం ప్రవేశం చేస్తారు.

## రెండవ రోజు అశ్వవాహనం

ఇక రెండవ రోజు 14-05-2008 బుధవారం వైశాఖ శుద్ధ దశమి ఇదె అసలు అలనాటి ముహూర్త దినం, ఆ సాయంత్రం శ్రీస్వామివారు అశ్వవాహనాన్ని అధిరోహించి, శిరస్త్రాణం లాంటి కిరీటాన్ని ధరించి సకల సార్వభౌమాధికార లాంఛనాలతో బయలుదేరి, వెంట దంతపు పల్లకిలో శ్రీదేవి భూదేవులు అనుసరించగా నారాయణగిరి ఉద్యానవనానికి తరలి వెళ్తారు. మొదటి రోజు మాదిరే శ్రీస్వామివారికి అమ్మవారలకు ఎదుర్కోలు, పూలబంతులాట, నూతన వస్త్రధారణ... వగైరా కార్యక్రమాలు పూర్తయిన తర్వాత కొలువు జరుగుతుంది. ఈ కొలువులో హరికథ, నృత్యం, పురాణం, ఇత్యాది కార్యక్రమాలు జరుగుతాయి. పిదప శ్రీవారు దేవేరులతో పల్లకి నెక్కి వీథుల గుండా ఊరేగుతూ ఆలయ ప్రవేశం చేస్తారు.



## మూడవ రోజు గరుడ వాహనం

ఇక మూడవరోజు 15-05-2008 గురువారం వైశాఖ శుద్ధ ఏకాదశి. ఈ రోజు సాయంత్రం స్వామివారు గరుడవాహనుడై వెళుతుండగా దేవేరులు దంతపు పల్లకి నెక్కి ఉద్యానవనానికి వెళ్తారు. ముందు రెండు రోజులుమాదిరే ఎదుర్కోలు, పూలచెండ్లాట నూతన వస్త్ర సమర్పణ వగైరా పెండ్లి వేడుకలు ఘనంగా ముగిసిన తర్వాత కొలువు జరుగుతుంది. వేదపారాయణ సంగీత కచ్చేరీ, మున్నగు కార్యక్రమాలు ముగిసిన తర్వాత స్వామి దేవేరులతో కూడి ఊరేగుతూ ఆలయ ప్రవేశం చేస్తారు. దీనితో మూడురోజుల పద్మావతీ పరిణయోత్సవాలు ఘనంగా ముగుస్తవి.

## ఎలా పాల్గొనాలి?

ప్రతి సంవత్సరం వైశాఖ మాసంలో వరుసగా శుద్ధ నవమీ, దశమి, ఏకాదశి రోజుల్లో మూడు రోజుల పాటు తిరుమల వేంకట ప్రభువుకు జరుపబడే పద్మావతీ పరియోత్సవంలో భక్తులు కూడ ఒక్కరోజు సేవలో మాత్రమే రూ. 5000ల రుసుమును చెల్లించి పాల్గొనవచ్చు.

ఈ నిర్ణీత రుసుము చెల్లించిన గృహస్థుతో పాటు ఐదుమందికి శ్రీవారి దర్శనావకాశం కల్పిస్తారు. అంతేగాక వీరికి ఉత్తరీయం, రవికగుడ్డతో పాలు 5 లడ్లు, 5 వడలు ప్రసాదంగా ఇవ్వబడతాయి.

ప్రతి వైశాఖ మాసంలో మూడు రోజుల పాటు జరిగే ఈ ఉత్సవంలో ఒక్క రోజుకు రూ.5000లు డిమాండు డ్రాఫ్టును "ఎగ్జిక్యూటివ్ ఆఫీసరు, తి.తి.దేవస్థానములు, తిరుపతి" వారి పేర ఏ జాతీయ బ్యాంకులోనైనా తీసి, దానిని ముందుగా " పేష్కారు, తిరుమల శ్రీవారి ఆలయం , తిరుమల-517504" వారికి పంపుతూ అనుమతిని పొందవచ్చును. అయినా అప్పటికి వున్న అవకాశాన్ని బట్టి మాత్రమే వీలు కల్పించబడుతుంది. వీరికి అనుమతి ధ్రువపత్రం ద్వారా తెలియజేస్తారు.

**టిటిడి సౌజన్యంతో...**